# డల్లాస్‌లో గాంధీ విగ్రహాన్ని సందర్శించిన నిక్కీ హేలీ



**టెక్సాస్:** అమెరికాకు ఐక్యరాజ్య సమితి అంబాసిడర్ అయిన నిక్కీ హేలీ.. డల్లాస్‌లోని గాంధీ మెమోరియల్‌ను సందర్శించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని మహాత్మాగాంధీ మెమోరియల్ నార్త్ టెక్సాస్ (ఎంజీఎంఎన్‌టీ) చైర్మన్ ప్రసాద్ తోటకూర ఓ ప్రకటనలో తెలిపారు. మే 23వ తారీఖున మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను నిక్కీ హేలీ సందర్శించి భారత జాతిపితకు ఘనంగా నివాళులర్పించారని ప్రసాద్ తోటకూర వెల్లడించారు. నిక్కీ హేలీకి ప్రసాద్ తోటకూర సాదర స్వాగతం పలికారు. 2014వ సంవత్సరంలో సౌత్ కరోలినా గవర్నర్‌గా నిక్కీ హేలీ ఉన్న సమయంలో ప్రవాసులు నిర్వహించే ఎన్నో కార్యక్రమాలకు ఆమె అతిథిగా విచ్చేసిన సంఘటనలను ఈ సందర్భంగా ప్రసాద్ తోటకూర గుర్తు చేసుకున్నారు. నిక్కీ హేలీని ఐక్యరాజ్య సమితి రాయబారిగా చూడటం తమకు ఆనందంగా ఉందన్నారు. నిక్కీ హేలీ ప్రోత్సాహంతో, ప్రవాసుల తోడ్పాటుతో ఒక మిలియన్ డాలర్ మేరకు విరాళాలను సేకరించి అమెరికాలోనే అతి పెద్ద గాంధీజీ విగ్రహాన్ని నిర్మించిన సంగతిని వివరించారు. 2014వ సంవత్సరంలోనే అక్టోబర్ 2న గాంధీజీ మునిమనవడు అయిన సతీష్ ధూపెలియాతో ఈ విగ్రహావిష్కరణ జరిగిందని గుర్తు చేశారు.

## (ఫోటో గ్యాలరీ కోసం క్లిక్ చేయండి)

గాంధీజీ మెమోరియల్‌ను సందర్శించిన సందర్భంగా.. ప్రవాసులను ఉద్దేశించి నిక్కీ హేలీ ప్రసంగించారు. గతంలో ప్రవాసులు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న మధురానుభూతులను ఆమె గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి చిహ్నంగా ఈ గాంధీజీ మెమోరియల్ ప్లాజా నిలిచిపోతుందని ఆకాంక్షించారు. గాంధీజీ గురించి, ఆయన అనుసరించిన మార్గాల గురించి నిక్కీ హేలీ వివరించారు. స్థానిక ప్రవాసులతో సమన్వయం చేసుకుంటూ, వారికి నాయకత్వం వహిస్తూ గాంధీ మెమోరియల్ ప్లాజాను ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేసిన ఎంజీఎంఎన్‌టీ చైర్మన్ ప్రసాద్ తోటకూరను నిక్కీ హేలీ ప్రసంశించారు. ప్రవాసుల కలను నిజం చేయడంలో ప్రసాద్ తోటకూర కృషి మరువలేనిదని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంజీఎంఎన్‌టీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ రావు కాల్వల, కమల్ కౌషల్, జాన్ హమ్మాండ్, తైయాబ్ కుండవాలా, పీయూష్ పటేల్, నరసింహా భక్తుల, కుంటేష్ ఛోక్సీ, శభనం మోడ్గిల్, జాక్ గోద్వానీ, ఇర్వింగ్ సిటీ మేయర్ రిక్ స్టోఫెర్, మేయర్ ప్రో టెమ్ అల్లన్ మీఘెర్, సిటీ మేనేజర్ క్రిస్ హిల్‌మన్ పార్క్స్ అండ్ రిక్రియేషన్ డైరెక్టర్ జోసెఫ్ మోసెస్ తదితరులు పాల్గొన్నారు.